క్లుప్తంగా

దివ్యాంగులకు చేయూత



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలోని ముగ్గురు దివ్యాంగులకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. దివ్యాంగులైన ఉప్పుటూరు జయరాం, ఉప్పుటూరు రామమూర్తి, చాగంటి చంద్రశేఖర్‌కు ఒక్కొక్కరికి రూ. 20వేల వంతున రూ. 60వేలు అందజేశారు. ఎటువంటి ఆధారం లేని వృద్ధుడు ముచ్చు చిన్నమాల్యాద్రికి రూ. 5వేలు అందజేశారు.

గృహ నిర్మాణాల పరిశీలన



అల్లూరు: స్థానిక టైలర్స్ కాలనీలో జరుగుతున్న జగనన్న గృహ నిర్మాణాలను నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది నాటికి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ జమీల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



వింజమూరు: గుండెమడకలలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను బుధవారం నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. తొలుత మహాగణపతి పూజ, విశేష హోమాలు, నూతన విగ్రహానికి జలాభిషేకం, క్షీరాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం అర్చకులు అప్పసముద్రం చంద్రశేఖరాచార్యుల చేతుల మీదుగా తొలుత విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి రూ.25వేలు, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ రూ. 25వేలు నగదు విరాళాలు అందజేశారు.

పెరటి తోటలతో ఆరోగ్యం పదిలం



ఆత్మకూరురూరల్: పెరటి తోటల్లో రసాయనాలు లేని, పోషక విలువలు కలిగిన కూరగాయలను పండించుకోవచ్చని, తద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని కరటంపాడులో వెంకటేశ్వర సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఐదు సెంట్ల భూమిలో సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలు, తదితరాలను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరటితోటల్లో కూరగాయలతో పాటు పండ్లు, ఆకుకూరలు పండించుకోవచ్చునన్నారు. రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. గ్రామానికి చెందిన సురేఖ, ప్రసాద్ పెరటి తోటల పెంపకందారులకు ఆదర్శకంగా నిలిచారని ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంపీ సుబ్బమ్మ, పీఆర్పీ నాగరాజు, ఆర్సీ మాధురి, పొదుపు సంఘాల మహిళలు, ఐసీఆర్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సంగం: వైకేపీ సిబ్బందికి సన్మానం



చేజర్లలో..



మర్రిపాడు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో..



ఉదయగిరిలో..

ఆత్మకూరు: గతంలో పురుషాధిక్య సమాజంలో మహిళలు వివక్ష, ఎన్నో ఆంక్షలు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి పూర్తిగా మారి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఘన విజయాలు సొంతం చేసుకుంటున్నారని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం మహిళలు ఉన్నత చదువులు చదివి ఉన్నత కొలువుల్లో రాణిస్తున్నారన్నారు. తమ కుటుంబాలను చాకచక్యంతో తీర్చిదిద్దే మహిళలు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఎస్సై రాజేష్, బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, న్యాయవాదులు తిరుపతమ్మ, వెంకటేశ్వర్లు, మెప్మా ఐపీ అంకయ్య, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు గంధళ్ల లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ప్రమీల, సీఓ మాధవి, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

వైకేపీ కార్యాలయంలో..

పట్టణంలోని వైఎస్సార్‌క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎం బీ వెంకమ్మ నేతృత్వంలో పొదుపు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పొదుపు రుణాలు వసూళ్లలో చక్కగా పనిచేసిన సీసీలను అభినందించారు. మెప్మా సిబ్బంది వెంకట రమణమ్మ, శ్రీనివాసులు, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరురూరల్: బోయలచిరివెళ్లలో అభ్యుదయ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకురాలు జ్యోతిజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. పాస్టర్ రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

• సంగం: స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీవోఏలు, పొదుపు మహిళలకు అంతర్జాతీయ మహి ళా దినోత్సవ విశిష్టతను వివరించారు. అనంతరం ఏపీఎం, సీసీలు, వీవోఏలను పొదుపు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

• అనుమసముద్రంపేట: సృష్టికి మూలం స్త్రీ అని ఏఎస్‌పేట కెనరా బ్యాంకు మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. ఏఎస్‌పేటలోని వైకేపీ కార్యాలయంలో ఏపీఎం సతీష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంకు మేనేజర్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు సమాజంలోని ప్రతి రంగంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక ప్రగతికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి అండగా నిలవడం అభినందనీయమన్నారు. కెనరా బ్యాంకు ఫీల్డ్‌అసిస్టెంట్ శివచక్రవర్తి, పొదుపు సభ్యులు అరుణమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

• చేజర్ల: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ విజయలలిత అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఎం చీర్ల సుజన ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ, ఏపీఎంను పొదుపు మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, మమత, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

• మర్రిపాడు: స్థానిక యూటీఎఫ్ భవనంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీకేడబ్ల్యూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ భారతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆడది అబల కాదని సబల అని నిరూ పించుకునే రోజులు రావాలన్నారు. మహిళలు ప్రభు త్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. అనంతరం ఐద్వా అధ్యక్షురాలు ప్రమీల, శ్యామలమ్మను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, నాయకులు చలపతిశర్మ, మోహన్ ప్రసాద్, నాయబ్, మూలి వెంగయ్య, ఐద్వా మహిళలు పాల్గొన్నారు.

• కావలి రూరల్: మహిళాభివృద్ధితోనే దేశప్రగతి సాధ్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి పేర్కొన్నారు. పట్టణంలోని బహుజన టీచర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రమాబాయి అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీటీఏ సభ్యులు కేఎఫ్‌సీ విద్యాలత, కుచల కుమారి, రోజామణి, ప్రియదర్శిని, విజయభారతి, నిర్మల, లక్ష్మి, ప్రసన్న, అనిత, తదితరులు పాల్గొన్నారు.

• ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏపీఎం ఎండీ ఖాజారహ్మతుల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళలను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

• వింజమూరు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్ఓ కే మాశిలామణి తన ఆస్పత్రిలో ఉత్తమ మహిళ గిరిజాకుమారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ భాస్కర్‌రెడ్డి, నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



కావలి: బీటీఏ ఆధ్వర్యంలో..



ఏఎస్‌పేటలో..



వింజమూరులో..



ఆత్మకూరురూరల్‌లో..



ఆత్మకూరు: మాట్లాడుతున్న జడ్జి బీ రాజశేఖర్



ఆత్మకూరు: వెలుగు కార్యాలయంలో..

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ ఇన్‌స్పెక్టర్ బీ నయనతార బుధవారం పట్టుకున్నారు. నాగులపాడు రహదారిలో బొగ్గేరు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఆమె వెంట సెబ్ సిబ్బంది ఉన్నారు.

పోలేరమ్మ గుడిలో అగ్నిప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం సోమేశ్వరపురం చెరువుకట్ట సమీపంలోని పోలేరమ్మ ఆలయంలో బుధవారం వేకువన అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అంతరాలయంలోని అమ్మవారి విగ్రహం, బీరువా, పూజాసామగ్రి కాలిపోయాయి. ఉదయాన్నే ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు మంటలు అదుపుచేశారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వైభవంగా గరుడ సేవ



సోమశిల: అనంతసాగరం మడలం కదిరిదేవరాయపల్లిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువన గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం భానుప్రకాశాచార్యుల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామితో పాటు ఉభయదేవేరులను విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉభయకర్తలుగా పోతల రామకృష్ణ, యల్లమ్మ దంపతులు వ్యవహరించారు.

ప్రసన్నుడి దయతో ప్రమాదం తప్పింది

- ఆగమ పండితుల సూచనలతో రథానికి మరమ్మతులు
- రహదారుల విస్తరణ, భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



క్రేన్ల సాయంతో రథాన్ని పైకిలేపి తరలిస్తున్న దృశ్యం



కాలువలోకి చక్రం దిగడంతో నెలకొరిగిన రథం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం సందర్భంగా అపశృతి చోటు చేసుకోవడం కలిచివేసిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పాతబిట్రగుంట రోడ్డు మలుపులో అదుపు తప్పి నేలకొరిగిన రథాన్ని క్రేన్ల సాయంతో పైకి లేపి యథాస్థానానికి తరలించే కార్యక్రమాన్ని బుధవారం ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవ తప్పిదం, రోడ్డు మలుపును అంచనా వేయడంలో జరిగిన పొరపాటు కారణంగా రథం అదుపుతప్పి నేలకొరిగిందన్నారు. సుమారు 50 అడుగుల ఎత్తున్న రథం వేలాది మంది భక్తుల మధ్యన అదుపుతప్పి నేలకొరిగినా ప్రసన్న వేంకటేశ్వరస్వామి దయతో ఎవరికీ చిన్నగాయం కూడా కాలేదన్నారు. ఆగమపండితుల సూచనలతో రథానికి వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో రథోత్సవంలో అపశృతులు చోటు చేసుకోకుండా రథం తిరిగే వీధులను వెడల్పు చేయించడంతో పాటు భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సంప్రోక్షణ, శాంతి పూజల అనంతరం మిగిలిన బ్రహ్మోత్సవాలను యథావిధిగా నిర్వహించనున్నట్లు వివరించారు.

మూడు గంటలు శ్రమించి..

బిలకూటక్షేత్రం ప్రసన్నవేంకటేశ్వరస్వామి రథాన్ని బుధవారం అధికారులు మూడు గంటల పాటు శ్రమించి యథాస్థానానికి చేర్చారు. మంగళవారం రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో అపశృతి చోటు చేసుకుని రథం నేల కొరిగిన విషయం తెలిసిందే. పాతబిట్రగుంట నుంచి కొండబిట్రగుంటకు రథోత్సవం వస్తుండగా రోడ్డు మలుపులో రథం అదుపుతప్పి నేలకొరిగింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్పటికే రాత్రి కావడం, రథాన్ని పైకి లేపేందుకు భారీ క్రేన్ల సాయం అవసరం కావడంతో ముందుగా వేదపండితులు, ఆగమ పండితులతో చర్చించి ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ చేయించి ఆలయానికి తరలించారు. అనంతరం రథాన్ని యథాస్థానానికి తరలించే అంశాంపై అధికారులకు సూచనలు చేశారు. ఉదయాన్నే రెండు భారీ క్రేన్లు తెప్పించి రథాన్ని యథాస్థానానికి తరలించారు. వివిధ శాఖల అధికారులు, పోలీసులు సుమారు మూడు గంటలు శ్రమించి రథాన్ని యథాస్థానానికి తరలించారు. ఈ పక్రియను ఎమ్మెల్యే రామిరెడ్డి ఘటనా స్థలంలోనే ఉండి స్వయంగా పర్యవేక్షించారు.

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం



ఆస్పత్రికి వచ్చిన గిరిజన మహిళ



ప్రైవేట్ ల్యాబ్‌కు స్కానింగ్ రెఫర్ చేస్తూ రాసిచ్చిన పేపర్

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతులను కల్పిస్తూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. అయితే కొందరు వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు అందుబాటు ఉన్నా ప్రైవేట్ ల్యాబ్‌లకు పరీక్షలకు పంపుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి ఘటన ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. ఆత్మకూరు మండలం గండ్లవేడుకు చెందిన శాంతి 9 నెలల గర్భిణి. గిరిజనురాలైన ఆమె ప్రతినెలా ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది. బుధవారం ప్రభుత్వాస్పత్రికి పరీక్షలు చేయించుకునేందుకు రాగా, ఓ డాక్టర్ అవసరం లేకున్నా ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లి స్కానింగ్, కరోనా పరీక్షలు చేయించుకురావాలని రాసిచ్చాడు. అక్కడకు వెళ్లిన గిరిజన మహిళ పరీక్షలకు అవసరమైన నగదు తన వద్ద లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరిగింది. ఈ విషయాన్ని ఆస్పత్రి వద్ద విలేకరులకు వెల్లడించింది. వాస్తవానికి గర్భిణికి స్కానింగ్ బదులుగా మరో పరీక్ష నిర్వహించి ఫలితాలు తెలుసుకునే అవకాశం ఉంది. అందుకు సంబంధించిన పరికరాలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. అయినా సదరు డాక్టర్ ఆస్పత్రిలో పనిచేసే ఓ వ్యక్తి నిర్వహిస్తున్న ప్రైవేట్ ల్యాబ్‌కు పంపారు. నిబంధనలను తొక్కి ప్రైవేట్ ల్యాబ్‌కు సంబంధించిన పేపర్‌పైనే పరీక్షలను సూచిస్తూ పంపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆస్పత్రి సమీపంలో ప్రైవేట్ ల్యాబ్ నిర్వహిస్తూ వైద్యులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నాన్ని వివరణ కోరగా, పేదలకు అన్ని విధాలా మెరుగైన వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ల్యాబ్‌లకు పరీక్షలకు పంపడం, ప్రైవేట్ ల్యాబ్‌కు సంబంధించిన పేపర్‌పైనే స్కానింగ్ చేయించుకోవాలని రాసి పంపడం తప్పేనన్నారు. వైద్యుడు రాసిన స్కానింగ్ కూ డా అవసరం లేదని తెలిపారు. ఈ విష యమై పూర్తి విచారణ జరిపి వైద్యుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇరువర్గాల దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్నవరపు శ్రీనివాసాచారి, వేణు

కావలి రూరల్: స్థల వివాదం నేపథ్యంలో ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు పాల్పడడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన పట్టణంలోని వెంగళరావునగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..వెంగళరావునగర్‌లో నూతక్కి కనకరత్నాచారి 2009లో నివేశన స్థలం కొనుగోలు చేసుకుని రేకుల ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని గోపాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి కొనుగోలు చేశారు. వారు తమ స్థలానికి ముందున్న మీ స్థలాన్ని తమకు విక్రయించాలని, లేకపోతే చంపేస్తామని కనకరత్నాచారిని బెదిరించారు. ఈ విషయాన్ని కనకరత్నాచారి తన బావలు శ్రీనివాసాచారి, వేణుకు తెలుపగా, వారు మాట్లాడి సర్దుబాటు చేసుకుందామని చెప్పడంతో మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో కనకరత్నాచారి ఇంటిపై కప్పు రేకులు తుప్పుపట్టిపోవడంతో పట్టకప్పుకునేందుకు బుధవారం యత్నిస్తుండగా, గోపాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సుహాస్‌రెడ్డి పట్టను లాగేశారు. ఇళ్లు తమదని మీకు దిక్కున్నచోట చెప్పుకోండంటూ కర్రలు, రాడ్డులతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో అన్నవరపు శ్రీనివాసచారి, చిరపోతు వేణు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అన్నవరపు శ్రీనివాసాచారిని నెల్లూరుకు తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సీతారామపురం: చిన్నాగంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, కౌన్సిలర్ త్రివేణి 10,11 వార్డులలో ప్రచారం సాగించారు. పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ అభ్యర్థులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కే బ్రహ్మానందయాదవ్‌ను ఆశీర్వదించాలని బీజేపీ నాయకులు పట్టణంలో ప్రచారం సాగించారు. పీడీఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పొక్కిరెడ్డి బాబుల్‌రెడ్డికి మద్దతుగా సీపీఎం, జేవీవీ, యూటీఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

ఆత్మకూరురూరల్: ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వల్లభనేని రాజేందర్ దేపూరు, బండారుపల్లి, ముర్లగళ్ల, నల్లపరెడ్డిపల్లి, కనుపూరుపల్లి, నువ్వూరుపాడు, తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు.

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి, బాట, నాగినేనిగుంట, పెగళ్లపాడు పరిసర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు ప్రచారం నిర్వహించారు.

వింజమూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా పట్టణంలోని బీసీ కాలనీ, జైభీంనగర్‌లో పార్టీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, నాయకులు అంకినపల్లి నరసింహారెడ్డి, విజయకృష్ణారెడ్డి, వంశీ, తదితరులు ప్రచారం సాగించారు.

సీతారామపురం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చిన్నాగంపల్లి, పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

సోమశిల: సోమశిలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

అనుమసముద్రంపేట : మండలంలోని కుప్పురుపాడు, కొండమీదకొండూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మండల జేసీఎస్ కోఆర్డినేటర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

సంగం: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి సంగంలో ప్రచారం నిర్వహించారు.

ఉదయగిరి: మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, సీఎం ఓబుల్‌రెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, గోగుల వెంగళరెడ్డి, కల్లూరు కృష్ణారెడ్డి ప్రచారం సాగించారు.